# స్నేహలతాదేవి

బందా కనకలింగేశ్వరరావుగారు

"బొందినశియించియును వహ్నిభూతమైన
బూదియందును ఛాయాప్రపూర్ణరాగ
రసవికాసములొప్పనన్ ప్రణయవిదుల
పరమబోధలనెంతు భావమ్మునందు"

— స్నేహలత

తలిరుప్రాయమ్ముననే తనువుదొరగిన తరుణియయ్యు స్నేహలతాదేవి, మానవహృదయసీమల శాశ్వతమైనస్థానము సంపాదించ కలిగినది. ఆమె 'యాత్మోపహారమునకు ప్రేరణధర్మము లత్యుదాత్తములగుట' స్నేహలత చరిత్రయందే స్పష్టమగుచున్నది.-సమస్తవేదాంగవేత్తయయిన హరేంద్రశర్మ వంగడమున 'విచ్చినపుష్పము' వోలె పుట్టినది. ఆ'నయగారికుమారిత' నెంతోగారాబముతో పెంచిరి. 'రాజరాజకుమారికారత్నములును' పొందలేనట్టిభోగము లనుభవించినది. విలక్షణమైన యా కుమారీమణికి యౌవనోదయంబయ్యె. ఈసమయంబుననే స్నేహలత జీవితప్రవాహము కలతనెందినది. వివాహప్రయత్నములతో, వరాన్వేషణముతో విస్తరించిన ఒకవిషమసమస్యయే ఈకన్యజీవితము బలిగొన్నది.—యౌవనముద్దీపించి ప్రేమపెంపొందుచుండు వయస్సు!-పదియునైదేండ్లు నిండనిబాల!-మనదేశమందీవయస్సె మనోవికాసము కలుగుతరుణము. అస్ఖలితమై నిష్కల్మషమైన కన్యాత్వ మీతరుణమందే ఆదర్శమైనపద్ధతుల ననుసరించ యుత్సాహించుచుండును

వరునికట్నముకొరకై, యిల్లువాకిలి అమ్మవలసి యిడుమలంబడుచున్న తండ్రియావస్థ ఈమె అద్దమంటిమనస్సున చివుక్కుమనిగాటినది అప్పుడుకలిగినవిషాదమే వితర్కణలోనికి మారినది. 'ఆదర్శబద్ధకౌతుకమై' 'విశుద్ధరాగలీనమైన' ఈమె హృదయము ఎట్టికష్టములైననోర్చసాహసించినది. తండ్రిపవిత్రగృహము తనవివాహముకొరకు వెచ్చించుటయే ప్రపంచమున ఆమెకు నీచతమముగతోచినది.

"సుంకమీయక మంగళసూత్రమునకు,
యోగ్యురాలుకాదేని నిర్భాగ్యయైన
కన్య యాజీవితము నేల కాల్చరాదు?"

అని ఒకవిధమైన విరక్తిపుట్టి మనస్సువిరిగిపోయినది. మనస్సు విరిగిపోయిన చేయరాని సాహసకృత్యములుండవుగదా!

మఱియు, నీమె మనోభావమును నైతికశంకలను, గట్టి తలంపులను తెలియజేయు లేఖయొకటున్నది ఈ లేఖయందామె 'కవితాహృదయము' ప్రజ్వరిల్లుచున్నది.—స్థూలదృష్టితో తిలకించిన స్నేహలతాదేవి 'రూపముగైకొన్న కవితాహృదయము.' ఆమె మాట, మనస్సు కవితాలోకమునకు తగినవియే ఆస్నేహలతాదేవిప్రతిమనే, ఆమె కవితాహృదయమునే ఈ వ్యాసమును విస్తరించెడి ప్రధానాంశము.

స్నేహలతామతల్లినిగూర్చి పాడు 'ఆవిషాదమృదులగీతిక' పదపదంబునను, ఆకన్నియ విశుద్ధ భావమునే వెల్లివిరియజేయును ఆమె మాటాడిన మాటయందు "మోహనకవితాప్రసాదము" మిక్కుటముగ నుం

డును. ఆమె కవితాస్వరూపిణి. సౌందర్యము కొఱకామెకు సంస్కారమవసరములేదు.

"శిథిలకుంతలయైయుండె స్నేహలతయు
నునుపుకాటుక కనుపాట్లలెనయజెరగి,
ఒకయనాదరణంపుపొందిక వెలార్చి"

అని చూడగల్గిన ధన్యాత్ము డనుచున్నాడు ఆమె నొకసారి గాంచిన మఱల మరువజాలరు హృదయముం దాకుమారీ ముఖబింబమప్పుడే హత్తికొనిపోవును.

"నడలయొప్పుల వినయబంధములుగలవొ,
చూపులవి ముగ్ధమైన నాజూకుగలదొ
నగుమొగమ్మున నందచందములుగలవొ"

ఎవరు పరీక్షించగలరు? ఎవరికి భేదించ శక్యమగును ఆముఖంబుననున్న నిండుతనము, గంభీరత! ఆకుమారీమణిని గాంచినవారు ఒకదివ్యజ్యోతినిగాంచినవారివలె మంత్రితులగుదురు.

"పరిచయరహస్యమాధుర్య మెఱిగినట్టి
ప్రణయులకు స్నేహలతవోలె ప్రాప్తవశత
కలసిమాటాడినట్టి ధన్యులకునెల్ల
తలపువెడలదు స్నేహలతామతల్లి"—

గంగాతీరమందలి, భావతరంగితహృదయై చెలి ప్రియంవదతో విహరించుచున్న స్నేహలత పలుకులు మగవారి మేన ములుకులే! కొంతసేపు

"ప్రకృతిమార్దవపూర్ణశోభలనుదెల్పి
పురుషునైజభౌతికభరంబును వెలార్చి
పరమశుచియైన ప్రేమప్రపంచమునకు,
నడుచుమార్గము మరలనేర్పడునె సకియ!"

అని నిరాశతో విలపించుచు గన్పట్టును ధీరయగుటచే అంతలోనే.

"పశుసహజమైన పురుషస్వభావమిటుల
పావనస్త్రీకళాభాగపదవినింత
నిరసనోన్మాదదృష్టిగణింపకున్నె?"

అని రోషారుణితనేత్రయై గర్జించుచున్నది.— తానవివాహితగా నుండుటంజేసి, తండ్రిం జెందెడి యపవాదు తనమూలముననే యని యవమానముంబొందు ఆకన్యాలలామ, గంగాప్రవాహమే తనకు శరణని దలపోయసాగును.

" సుఖదుఃఖలోలగతుల
సంకరము గాని యానందజగతియేదొ?"

అని వెదుకకొన నారంభించెను. అంతకంతకు బేలయైపోవుచున్న యాయబల వికలహృదయయగునేమోయని సందేహమొదవుచుండెను. గంగానది పవిత్రమైనదా? మంగళస్నానము లీయేటియందుననే జరుగును. నివాపోదకములుగూడనిందే!

"నిత్యకల్యాణతోరణనిబిడయగునొ,
శాశ్వతశ్మశానజ్ఞానశాల యగునొ"

ఆమె కింకను దృఢపడలేదు. ఇంత భావవ్యాకులమై అల్లకల్లోలితంబైన ఆమె హృదయ మెంతభయానకము! ఎంత ఆవేశాపూరితము! ఆమనోపరివర్తనలెట్లు భ్రమించుచున్నవి?—

ఆమె జీవితసందేశమందు, 'కన్యకా'ధర్మమంత విస్పష్టముగాకున్నను, పితృగృహపరిరక్షణ మగ్రస్థానమాక్రమించినది.. ఆమెకు కనకదుర్గాంబ ప్రసన్నమయినది. తుదకామె ప్రశాంతభావముదాల్చినది. ఇప్పుడామె దయారసమొలుకుచున్నది. ఆమె మాటలిప్పుడు జాలిగొలుపుచు కన్నీరొలికించుచున్నవి. ఆమెచరిత్రచే ఆర్యావర్తము ప్రతిధ్వనించుచున్నది. "పంకపుగడాల రాసిలో పడి భ్రమించు నిండుజాబిలిరేక"వలె కన్ను

లుమిలుమిట్లుగొల్ప అగ్నిప్రవేశ మొనరించిన ఆపదియేనేడులపిల్ల నెవ్వరుమఱవగలరు? ఆమె కవితాహృదయు మెవ్వరుస్మరింపకుందురు? ఆర్యావర్తబాలామణులనందఱిని 'ఓ హో' యనిపించిన ఆయవతారమూర్తి నెట్లుప్రశంసించుట?

'భరతజనయిత్రి సుకృతతపఃఫలమ్మన, జననమందిన యువజనులే' తెలివిదెచ్చుకొని నీచమైన శుల్కగ్రహణమును నిషేధించవలెగాని, పాపము కన్నెలేమిసేయగలరు? స్నేహలతామతల్లివంటి కన్యారత్నము లిట్లునశియింప దేశమోర్వగలదా? ఇందు కన్యకాధర్మమేమున్నది?

"అధమపౌరుషమనక కన్యలవరింప
శుల్కములకాసజేసెడి శూరులయిరె"

అని విచారింపవలసియున్నది, ఈయువజనులనుగూర్చి. స్నేహలతాదేవి జీవితమొక స్వప్నమువలెతోచును. పాపము! పదునేను సంవత్సరములు! కవితాప్రపంచమును హృదయమునందిమిడించుకొన్న, యిమిడించుకొనగలిగిన ఒకదివ్యవ్యక్తిఆమె.

"సుభగతాంబులరక్తిమాశోభమధ్య
ఒత్తు తెలినవ్వురేకులగుత్తిమాద్రి"

ఆపండునిప్పులలో నవ్వుచుప్రవేశించినది!

ఆర్యకన్యాకులీనత కర్తవ్యముగ
తనువుదొరగిన స్నేహలతామతల్లి
రగులజేసిపోయిన పవిత్రంపువహ్ని
ఋషులఈభూమి పునరుద్ధరించుగాత!

('స్నేహలత' గ్రంధకర్తనుగూర్చి)

ఉ. వెన్నెలనిగ్గువోలె వికసించువిశుద్ధపదాలగూర్చి దా
జెన్నలరారవ్రాసె కవిశేఖరుడొక్కరు డట్ల "మిన్నులన్
మన్నులు మీరుమేమును సమస్తచరాచరభూత సృష్టియున్
కన్నియలోనలీనమయి గానముజేయగ నామె నామమున్."

## సతీహితము

శ్రీమతి అంబటి లక్ష్మీనాంచారమ్మగారు

చం. పురుషుఁడెదేనిగ్రామమునుబోయి గృహంబునుజేర మాత స
త్వరముఁబట్టి పొట్టగను భార్యయె వీపునుజూచునంచు నీ
వరకె సతీజనంబు కొకభారపునింద శిరంబునుండె నే
తెఱగునసంచరింప నదితీరునొ యెర్గి చరింపు మానినీ!

## బ్రతుకుబరువు

గుంటూరి వేంకటశాస్త్రిగారు

ఈనిదాఘమువేళ, నాయీవిషాద
గాథలోనద్రవించిన కఠినశిలలె
నాకుమృదుశయ్యలయ్యె నెన్నాళ్లనుండి?
ఈనదీజలమెల్ల నాయీయెడంద
నిండుచల్లనినీట ఘనీభవించి

మానెప్రవహింప నెన్నడోకాని మొదట?
తీయనిస్వరంబు దిశలప్రతిధ్వనింప
స్వేచ్ఛగా గానమొనరించు పికకుమారు
లలసి విసుగంది యెచటకో వెడలినారు?
వారిగానమువింటి నద్దాలక్రితము.